

వేద మంత్రాలు.. ఆటపాటలు

నిత్యం వేదాలతో కుస్తీ పడే వేదవిద్యార్థులు ఆదివారంపాఠాలకు కాస్త విరామం ఇచ్చి, ఆటల్లో మునిగితేలారు. - 8లో



ముగిసిన నాట్య పోటీలు

మహతిలో 9 రోజులపాటు కనులపండువలా సాగిన జాతీయ నాటక, నృత్య పోటీలు ఆదివారంతో ముగిశాయి. - 8లో



కిక్కిరిసిన బోయకొండ

చిత్తూరు జిల్లాలోని బోయకొండ గంగమ్మ దర్శనానికి భక్తులు తరలిరావడంతో ఆలయం కిక్కిరిసిపోయింది. - 8లో

న్యూస్‌రీల్

తిరుమలలో అదనపు ఈఓ తనిఖీలు



క్యూలో తనిఖీలు చేస్తున్న అదనపు ఈవో

తిరుమల: తిరుమలలోని పలు ప్రాంతాలను, దర్శన క్యూలను టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి ఆదివారం సాయంత్రం క్షుణ్ణంగా పరిశీలించారు. ఆల్వార్ ట్యాంక్ అతిథి గృహాల వద్ద వున్న ఎస్ఎస్‌డీ క్యూలు, టోకెన్ తనిఖీ కేంద్రాలను తనిఖీ చేశారు. తరువాత వైకుంఠం క్యూ కాంప్లెక్స్–1 మరియు 2లోని కంపార్ట్‌మెంట్లు, సుపథం వద్ద చిన్నపిల్లల తల్లిదండ్రులు, దాతలతోపాటు వివిధ రకాల క్యూల వివరాలను సంబంధిత అధికారులు ఆయనకు వివరించారు. అదనపు ఈవో వెంట ఎస్ఈ 2 జగదీశ్వర్‌రెడ్డి, డిప్యూటీ ఈవోలు లోకనాథం, ఆశాజ్యోతి, ట్రాన్స్‌పోర్ట్ జీఎం శేషారెడ్డి, వీజీఓలు నందకిషోర్, గిరిధర్ రావు ఇతర అధికారులు ఉన్నారు.

కలెక్టరేట్‌లో నేడు స్పందన

– ప్రజలకు తనిఖీల తంటాలు తప్పేనా?


తిరుపతి అర్బన్: తిరుపతి కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి గ్రీవెన్స్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)సోమవారం నిర్వహించనున్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ఈ గ్రీవెన్స్‌కు అన్ని విభాగాలకు చెందిన జిల్లా అధికారులు హాజరుకానున్నారు. అంతేకాకుండా డీఆర్వో, జేసీ, కలెక్టర్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారు. దీంతో జిల్లాలోనూ వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు అర్జీలతో వస్తుంటారు. అయితే ఈ కలెక్టరేట్‌లో పోలీసులు మూడు చోట్ల ప్రజలను తనిఖీలు చేస్తున్నారు. దీంతోపాటు ఓ క్రమ పద్ధతి లేకుండా గందరగోళ వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. సిఫార్సులుండే వాళ్లనే ముందుగా అధికారులను కలవడానికి పంపుతున్నారు. దీంతో ఉదయం నుంచి పడిగాపులు కాస్తున్న వృద్ధులు, దివ్యాంగులు గంటల కొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితులు గతవారం చోటుచేసుకున్నాయి. అలాంటి పరిస్థితులు మళ్లీ పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉందని అంతా కోరుతున్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 84,173 మంది స్వామివారిని దర్శించుకోగా 32,519 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.50 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

మీ భూమి.. ఇక బాబుదే!

పుంగనూరు మండలం రాగానిపల్లెలోని భూములు



ఇక పేదల భూములన్నీ చంద్రబాబువే.. అధికారం వచ్చీ రాగానే కూటమి ప్రభుత్వం పంజా విసిరింది. ప్రజల భూములు లాక్కోవడానికి పక్కా స్కెచ్ వేసింది. ముందుగా ప్రజల భూ రికార్డులన్నీ ఆన్‌లైన్‌లో ప్రభుత్వ భూమిగా మార్పులు చేస్తోంది. ఆ తరువాత ప్రభుత్వ భూమిని పేదలే కబ్జా చేశారని ముద్ర వేస్తోంది. గతంలో ఎన్ని రిజిస్ట్రేషన్లు జరిగినా, ఎన్ని పత్రాల ఆధారాలున్నా, ఆ రికార్డులు తారుమారు చేసేందుకు సిద్ధమైంది. ప్రస్తుతానికి 982 ఎకరాలకు సంబంధించిన రికార్డులను ప్రభుత్వ భూములుగా మార్చేసింది. ఇవన్నీ బ్రిటీషు కాలం నాటి నుంచి ప్రైవేటు వ్యక్తుల మీద రిజిస్టరవుతూ వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే హఠాత్తుగా ఇవన్నీ ప్రభుత్వ భూములుగా మారిపోయాయి. అయితే ఈ భూములకు మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో జరిగిన అగ్ని ప్రమాదం కేసును లింకు పెట్టి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై కక్ష సాధింపులకు దిగుతోంది. ఈ భూములు పుంగనూరు మండలం రాగానిపల్లె సమీపంలో ఉన్నాయి. ఈ భూములకు సంబంధించిన రికార్డులన్నీ చిత్తూరు కలెక్టరేట్‌లో భద్రంగా ఉన్నట్లు తేలడం కొసమెరుపు.

- 982.48 ఎకరాలపై టీడీపీ పంజా
- బ్రిటీష్‌కాలం నాటి రికార్డులు తారుమారు
- నాడే రిజిస్ట్రేషన్‌లు జరిగినట్లు ఆధారాలు
- భూములన్నీ అనాధీనం కింద మార్చేసిన కూటమి ప్రభుత్వం
- ఆ నిందలన్నీ మాజీ మంత్రి కుటుంబంపై వేస్తున్న వైనం
- ప్రభుత్వ నిర్వాకంతో విస్తుపోతున్న రెవెన్యూ యంత్రాంగం

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడవక ముందే రెవెన్యూ రికార్డులను మార్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో వెబ్‌ల్యాండ్ పేరుతో అనేక అక్రమాలు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే ఆ అక్రమాలను వెలికితీసేందుకు రీ సర్వేకు శ్రీకారం చుట్టింది. అయితే పూర్తిగా చేస్తే చంద్రబాబు దోచుకున్న భూముల చిట్టా వెలుగులోకి వచ్చేస్తుందని భయపడ్డ చంద్రబాబు దాన్ని అడ్డుకోవడానికి నానాపాట్లు పడ్డారు. అందుకే ఇప్పుడు ఆ రీ సర్వేని కొనసాగించే సాహసం చేయలేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. పేదల భూములను దోచుకునేందుకే చంద్రబాబు వెబ్‌ల్యాండ్‌ను ప్రవేశపెట్టారని రెవెన్యూ అధికారులు వెల్లడిస్తున్నారు. ఆ వెబ్‌ల్యాండ్ మాంత్రికుడు చంద్రబాబు అధికారంలోకి రాగానే తన పాత అనుభవాలకు పని పెడుతున్నారు. వెబ్‌ల్యాండ్‌లో కిటుకులు తెలిసిన చంద్రబాబు తిరిగి అక్రమాలకు తెరలేపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పుంగనూరు మండలం రాగానిపల్లి భూములపై కన్నేశారు. రాగానిపల్లి గ్రామ దాఖలా సర్వే నెంబరు 22లో ఉన్న 982.48 ఎకరాల భూమి పూర్తిగా ప్రైవేటు భూమి అని, అది ప్రభుత్వ భూమి కాదని బ్రిటిష్, జమీందారి కాలం నాటి రికార్డులు వెల్లడిస్తున్నాయి. ఎన్నో ఏళ్ల నాటి రెవెన్యూ రికార్డులలో ఆ 982.48 ఎకరాలు రైత్వారి భూమిగా ఉంది. కూటమి సర్కారు అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాగానిపల్లి భూములపై అసత్య ఆరోపణలు చేయడం మొదలుపెట్టారు. తమకు అనుకూలమైన పత్రికల్లో రైతుల భూములను ప్రభుత్వ భూములుగా చెప్పించి అసత్య కథనాలను ప్రచురిస్తున్నారు. వారి ధోరణి చూసి, చుట్టుపక్కల ఉన్న రైతులు బెంబేలెత్తిపోతున్నారు. మరోవైపు రెవెన్యూ అధికారులు ఈ రికార్డుల మార్పులతో తమకు సంబంధం లేదంటూ తప్పించుకుంటున్నారు.

కూటమి ప్రభుత్వం రాగానే..

అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇప్పుడు హఠాత్తుగా ఈ భూములన్నీ అనాధీనంగా మారిపోయాయి. రెవెన్యూ రికార్డులన్నీ తారుమారై పోయి ఆన్‌లైన్‌లో ప్రభుత్వ భూమిగా చూపుతున్నాయి. దీన్ని సాక్ష్యంగా తీసుకుని టీడీపీ, అనుకూల పత్రికలు అది ప్రభుత్వ భూమి అంటూ ప్రచారం చేస్తున్నాయి. దీంతో రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నప్పటికీ, కొన్నేళ్ల నుంచి తమ అనుభవంలో ఉన్నప్పటికీ రైతులకు ఆ భూములు చెందకుండా పోయాయి. ఈ భూములను వీలైనంత త్వరగా స్వాధీనం చేసుకోవడానికి ప్రభుత్వం తీవ్రంగా యత్నిస్తుండడం గమనార్హం.

రికార్డులు ఏం చెబుతున్నాయంటే..

రాగానిపల్లిలో గల భూములను తొలుత పుంగనూరు జమీందారు మహదేవరాయులు, శంకర్‌రాయులుకు జమీందారి పట్టా నెంబరు 20గా మంజూరు చేశారు. సదరు భూమిని 1907లో మహదేవరాయులు తల్లి సావిత్రమ్మకు భాగపరిష్కార పత్రం ద్వారా సంక్రమించింది. 1943లో ఆమె తన ఆస్తులను కుమారుడైన మహదేవరాయులుకు రిజిస్టర్డ్ వీలునామా ద్వారా కేటాయించారు. దీనిపై సర్వే సెటిల్‌మెంట్ అధికారులు ఫ్రీ ఎస్టేట్ అబాలిష్ రికార్డులను పరిశీలించి మహదేవరాయులు కుమారుడైన శంకర్‌రాయులుకు 27-02-1958న రఫ్ పట్టా మంజూరు చేశారు. ఈ సమయంలో ఉన్న పైమాషి నంబరు- 25, 26, 27, 28ని మార్పు చేస్తూ సర్వే నెంబరు 22గా, పట్టా నెంబరు 300 గా మంజూరుచేశారు. దీనిపై ఆనాటి సర్వే సెటిల్ మెంట్ అధికారులు గ్రామంలో పూర్తి విచారణ నిర్వహించారు. విచారణలో అభ్యంతరాలను ఇటు ప్రభుత్వం నుంచి అటు ప్రజల నుంచి లేకపోవడంతో ఎస్టేట్ అబాలిష యాక్ట్ 1948, సెక్షన్ 11ఏ కింద రైతు వారీ పట్టా మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చారు. దీనిని బట్టి ఆ భూమి ప్రైవేటు భూమిగా రైతువారీ పట్టాగా నిర్ధారణ అయింది.

ఎన్ని సార్లు సర్వే చేసినా అదే పట్టా

రాగానిపల్లికి చెందిన 982.48 ఎకరాల భూమిపై మల్లుపల్లికి చెందిన వెంకటస్వామి, రెడ్డెప్పరెడ్డి కలసి శంకర్‌రాయులు ద్వారా రిజిస్టర్డ్ కొనుగోలు చేసుకున్నారు. 1964లో సదరు వ్యక్తుల కుమారులు అగస్తిరెడ్డి, మునెప్ప, చిన్నప్ప రెడ్డెప్పరెడ్డి, వెంకటరెడ్డి, వెంకటస్వామి మైనర్ గార్డియన్లుగా కొంత భూమిని, చెన్నకేశవరెడ్డి కుమారుడు ఎల్.మాధవరెడ్డికి విక్రయించారు. 1966లో మిగిలిన అర్ధ భాగాన్ని కూడా రెడ్డెప్పరెడ్డి మాధవరెడ్డికే విక్రయించారు. సదరు ఎల్.మాధవరెడ్డి ఈ భూములను పలువురికి విక్రయించారు. దీనిపై 1971లో అప్పటి చిత్తూరు కలెక్టర్ విచక్షణా అధికారంతో సదరు భూములకు రైతు పట్టాను రద్దు చేయాలని నెల్లూరు సర్వే సెటిల్‌మెంట్ అధికారిని కోరారు. అయితే 1958లో పట్టాను మంజూరు చేసినందున ఆ పట్టా రద్దు చేసే అధికారం తనకు లేదని దీనిపై నెల్లూరు సర్వే సెటిల్‌మెంట్ అధికారి తేల్చిచెప్పేశారు. అవసరమైతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకోవాలని లేఖ పంపారు. దీనిపై పలుమార్లు నెల్లూరు సర్వే సెటిల్‌మెంట్ అధికారి ఇది రైతు పట్టాగా నిర్ధారించి, కలెక్టర్‌కు ఉత్తర్వులు పంపారు.



xx. From the above, the patta granted by the primary authority was upheld by the Commissioner (Appeals). The Revision authority again remitted the matter for envisaging the original work, which is [illegible]

xxi. As such, the matter was already decided and granted rough patta at initial stage and confirmed the rough patta in later stage in due process of the under the provisions of A.P. (AA) Estates (Abolition and Conversion into Ryotwari) Act, 1948 and the action of the settlement authority in confirming the Rough Patta holds good. Hence question of grant of Ryotwari patta afresh does not arise.


xxii. Therefore, the matter is not available to this authority either to review or to grant afresh or to resumption of the land to Govt.,

In the above enumerated facts and circumstances, the original work envisaged in the act was already completed by the competent authority during SS operations itself and the observations of the Special Commissioner and Director of Survey, Settlements and Land Records were fulfilled. Since the earlier orders of patta cancellation orders of DOS were set aside by the competent authority, this authority has no jurisdiction to grant patta afresh which was granted in the year [illegible] and thereby the settlement authorities and the matter is disposed accordingly.

Typed to dictation, corrected by me and pronounced the order in the open court on this the 25th day of March, 2023.

Joint Collector
[illegible] Settlement Officer
Chittoor.

చిత్తూరు జాయింట్ కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు



కలెక్టరేట్‌లోని పాత రికార్డులు

అన్నింటికీ పెద్దిరెడ్డి కుటుంబమే కారణమట!

ఇటీవల మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్ జరిగి కొన్ని ఫైళ్లు కాలిపోయాయి. అయితే రాగానిపల్లె భూములు కాపాడుకునేందుకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఆ షార్ట్ సర్క్యూట్ ఉద్దేశపూర్వకంగా చేయించారంటూ కథలు అల్లేశారు. ఆ కథలను టీడీపీ అనుకూల పత్రికల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. వాస్తవానికి రాగానిపల్లి భూముల రికార్డులు పలమనేరు రెవెన్యూ డివిజన్, చిత్తూరు కలెక్టరేట్‌లో ఉంటాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే రాగానిపల్లెలోని రైతుల భూములను వెబ్‌ల్యాండ్‌లో ప్రభుత్వ భూములుగా తారుమారు చేయించి, దాన్ని మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబంపై వేసేందుకు అధికార పార్టీ కుట్రలు చేస్తోందనడానికి ఇదే నిదర్శనం.

పునఃవిచారణలోనూ ప్రైవేటు భూములే..



రాగానిపల్లె సమీపంలోని భూములు

హైదరాబాద్‌లోని డైరెక్టర్ ఆఫ్ సెటిల్‌మెంట్ స్వీయ పరిశీలనలో కేసును 1973లో విచారణ చేపట్టారు. ఆ విచారణలో రెండు కారణాలను చూపుతూ 1977లో పట్టా రద్దు చేశారు. 1978లో సదరు ఉత్తర్వులపై రైతులు కమిషనర్ సర్వేసెటిల్ మెంట్ వారి ఎదుట రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. సదరు పిటిషన్‌ను కమిషనర్ ఆలస్యంగా దాఖలు చేశారని తిరస్కరించారు. దీనిపై రైతులు 1978లో హైకోర్టును ఆశ్రయించగా, 1980లో హైకోర్టు సర్వే సెటిల్‌మెంట్ అధికారుల ఉత్తర్వులను రద్దు చేస్తూ సదరు భూములపై రైతుల హక్కు, అనుభవం ఉన్నందున దీనిపై సర్వే సెటిల్‌మెంట్ కమిషనర్ హైదరాబాద్ పునర్విచారణ చేయాలని ఆదేశించింది. 2006లో కమిషనర్ తన తీర్పులో 1977 డైరెక్టర్ ఆఫ్ సెటిల్‌మెంట్ ఇచ్చిన తీర్పు సరిలేదని, పట్టా ఇచ్చిన 20 సంవత్సరాలు తరువాత కేసును స్వీయ పరిశీలనకు తీసుకునే అధికారం లేదని తీర్పు వెలువరించారు. తిరిగి దీనిని పునఃపరిశీలన చేయమని డైరెక్టర్ ఆఫ్ సెటిల్‌మెంట్‌ను ఆదేశించారు. దీనిపై 2022లో సదరు డైరెక్టర్ ఆఫ్ సెటిల్‌మెంట్ వారు తీర్పును ప్రకటించి, 1958లో రైతులకు ఇచ్చిన పట్టా ప్రక్రియ పూర్తయ్యిందా లేదా తెల్పమని చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌ను ఆదేశించారు. దీనిపై సదరు జిల్లా జాయింట్ కలెక్టర్ 25-03-2023న రైతులకు ఫ్రీ అబాలిష కాలం రికార్డులు, రిజిస్టర్డ్ పత్రాలు, 1958లో సర్వే సెటిల్‌మెంట్ అధికారులు మంజూరు చేసిన రఫ్ పట్టా, పట్టాను ఆమోదిస్తూ జారీ చేసిన ఉత్తర్వులు, రెవెన్యూ రికార్డులు ఎస్ఎల్ఆర్, ఎఫ్ఎల్ఆర్ లను పునఃపరిశీలన చేశారు. 66 సంవత్సరాల క్రితం సదరు భూమికి రైత్వారీ పట్టా మంజూరు చేశారని, ఇందులో తాను చేయాల్సింది ఏమి లేదని జాయింట్ కలెక్టర్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ భూమికి సంబంధించిన రికార్డులు అన్నీ భద్రంగా సర్వే సెటిల్‌మెంట్ ఆఫీసులో ఉన్నాయని సూచించారు. ఇలా పునఃవిచారణ చేయగా రాగానిపల్లి సర్వే నెంబర్ 22 లోని 982.48 ఎకరాల భూమి ప్రైవేటు భూములుగా తేల్చేశారు.



ఆ భూముల్లో సాగవుతున్న మామిడితోట

అట్టుడుకుతున్న చంద్రగిరి!

- మోహిత్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌తో అగ్నికి ఆజ్యం
- అడ్డంకులు దాటి వేలాదిగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- ఆందోళనలు, ధర్నాలకు వైఎస్సార్‌సీపీ సమాయత్తం
- పోలీస్‌స్టేషన్ పరిసరాల్లో భారీగా బలగాల మోహరింపు
- 41ఏ నోటీసు ఇచ్చి పంపించేసిన పోలీసులు

తిరుపతి రూరల్: అధికార పార్టీ శ్రేణుల దాడులు, అక్రమ కేసులు, అల్లర్లు, హత్యాయత్నాలు, దౌర్జన్యాలు, వేధింపులతో చంద్రగిరి నియోజకవర్గం రెండు నెలలుగా అట్టుడికిపోతోంది. నియోజకవర్గంలో గత 56 రోజుల్లోనే దాదాపు 163కు పైగా సంఘటనలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. చంద్రగిరి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాజకీయ దాడుల్లో పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు గాయపడ్డారు. జేసీబీలను తీసుకువచ్చి మరీ వైఎస్సార్‌సీపీ ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. పట్టపగలే ఇళ్లు, దుకాణాలను కూల్చివేస్తున్నారు. దౌర్జన్యంగా ఇళ్ల వద్దకే వెళ్లి కత్తులు, రాడ్లతో దాడులు చేస్తున్నారు. ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వెళితే పోలీసుల సమక్షంలోనే దాడులకు తెగబడుతున్నారు. ప్రజాప్రతినిధి భార్య స్టేషన్‌కు వచ్చి పోలీసులను బెదిరించి మరీ నిందితులను విడిపించుకుని వెళ్తున్నా...పోలీసులు మాత్రం కళ్లప్పగించి చూస్తున్నారు. కనీసం అడ్డుకునే ప్రయత్నం కూడా చేయక పోవడం గమనార్హం. దాడులకు తెగబడుతున్న వారికి పోలీసులు కొమ్ముకాస్తున్న వైనంపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతున్నారు. ఈ దాడుల్లో మొత్తం 73 మంది బాధితులను ఇప్పటి వరకు గుర్తించారు. వారికి వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక సాయం అందించారు.



ఎస్వీయూలో మోహిత్ రెడ్డితో కలిసి పార్టీ శ్రేణుల ర్యాలీ

పోలీస్ నిఘా వ్యవస్థ హెచ్చరికలతో..

మోహిత్‌రెడ్డి అరెస్ట్‌తో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆగ్రహంతో ఉండడం, భారీగా స్టేషన్ పరిసరాలకు తరలివచ్చే అవకాశం ఉందని పోలీస్ నిఘా వ్యవస్థ హెచ్చరించింది. దీంతో తిరుపతిలో 144 సెక్షన్ విధించారు. వర్సిటీ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే దారుల్లో ఆంక్షలు విధించారు. బారికేడ్లను ఏర్పాటు చేశారు. వందలాది మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. పోలీసు ఆంక్షలను ఛేదించుకుని మోహిత్‌రెడ్డి స్టేషన్‌కు వచ్చేసరికే వందలాది మంది వైఎస్సార్‌సీపీ శ్రేణులు అక్కడికి చేరుకోవడంపై పోలీసులు ఆశ్చర్యపోయారు. నినాదాలతో స్టేషన్ పరిసరాలు మార్మోగాయి. పోలీసులు సైతం రిమాండ్, జైలు అనకుండా కేవలం 41ఏ నోటీసు మాత్రమే ఇచ్చి మోహిత్‌రెడ్డిని విడుదల చేశారు. స్టేషన్ నుంచి బయటకు వచ్చిన మోహిత్ రెడ్డి వేలాది మంది పార్టీ శ్రేణులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి వెనుదిరిగారు. దీంతో పోలీసులు సైతం ఊపిరిపీల్చుకున్నారు.

మోహిత్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌తో..

ఇప్పటికే చంద్రగిరి నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయ వేధింపులు, దాడులతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు విసిగిపోయి ఉన్నారు. అంతలోనే విదేశాల్లో చదువుకుని ప్రజాసేవకు వచ్చిన తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిపై అక్రమ కేసు నమోదు చేసి వేధిస్తున్న వైనంపై మరింత మండిపడుతున్నారు. మహిళా వర్సిటీలో జరిగిన ఘటనకు సంబంధించి తనకు సంబంధం లేకపోయినా, ఘటన సమయంలో సాక్షాత్తు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎన్నికల అధికారుల సమక్షంలోనే తాను ఉన్నా కూడా రాజకీయ కక్షతోనే ఘటన జరిగిన 52 రోజుల తర్వాత మోహిత్‌రెడ్డిపై కేసు నమోదు చేయడాన్ని పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. అంతేకాకుండా ఆర్థిక మోసాలకు పాల్పడిన వారికి, దేశద్రోహులకు, అంతర్జాతీయ నేరస్తులకు, ఉగ్రవాదులకు, తీవ్రవాదులకు జారీ చేసే లుక్ అవుట్ నోటీసులు ఇవ్వడం, అర్ధరాత్రి బెంగళూరులో అరెస్ట్ చేయడం అగ్నికి ఆజ్యం పోసినట్లైంది. అందుకే మోహిత్‌రెడ్డి అరెస్ట్ వార్త వినగానే వేలాదిగా తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీకి తరలివచ్చారు. మోహిత్ రెడ్డిని జైలుకు పంపితే ధర్నాలు, రాస్తారోకోలు చేసేందుకు సమాయత్తం అయ్యారు.



పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రామగిరిలో తెప్పోత్సవ వైభవం





తెప్పపై విహరిస్తున్న దేవసేన సమేత ముత్తుకుమార స్వామి, కావళ్లతో తరలివస్తున్న భక్తులు

నాగలాపురం : శ్రీ వల్లిదేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో భరణి తెప్పోత్సవాలు ఆదివారం వేడుకగా ప్రారంభమయ్యాయి. ఆడికృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకుని పిచ్చాటూరు మండలం రామగిరి శ్రీ సుబ్రమణ్య స్వామి ఆలయ ప్రాంగణం హరోహర నామస్మరణతో మారుమోగింది. ఉదయం స్వామివారి మూలవర్లకు భరణి అభిషేకం చేసి వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని పుష్కరిణిలో కావళ్లు చెల్లించి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన వేలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం శ్రీ వళ్లీదేవసేన శ్రీ సుబ్రమణ్య స్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకం చేసి, వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి తిరుచ్చిపై అధిష్టించారు. స్వామి అమ్మవార్లను ఆలయం నుంచి ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు వేంచేపు చేసి తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీన్ని తిలకించిన భక్త జనం రాత్రంతా ఆలయ ప్రాంగణలో జాగారం చేశారు. భక్తుల కాలక్షేపం కోసం భక్త మార్కండేయ హరికథ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉభయదారులుగా మాజీ శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజి రెడ్డి, కుటుంబసభ్యులు వ్యవహరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా ఆలయ కార్యనిర్వాహణ అధికారి లత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉదయం అష్టమి పూజలు

రామగిరిలో అష్టమిని పురస్కరించుకుని ఉదయం శ్రీ కాలభైరవి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. మహిళలు నేతి దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శ్రీ వాల్మీకేశ్వరాలయ క్షేత్ర పాలకుడిగా కొలువై ఉన్న సంతాన కాలభైరవ స్వామి మూలమూర్తిని దర్శించుకుని తరించారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. భరణి, అష్టమి ఒకేరోజు రావడంతో భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.

భారీ పోలీసు బందోబస్తు

ఆలయానికి వేలాది మంది భక్తులు రావడంతో పోలీసులు ఉన్నత అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. తెప్పోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పుత్తూరు డీఎస్పీ శ్రీనివాస రావు పర్యవేక్షణలో సీఐలు భాసకర్ రావు, దివాకర్ రెడ్డి, వారితో పాటు ఐదుగురు ఎస్ఐలు, 110 మంది పోలీసు సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నట్లు పిచ్చాటూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

క్లుప్తంగా

త్వరలో కొత్త తహసీల్దార్లు

తిరుపతి అర్బన్: రేపో మాపో జిల్లాకు పాత తహసీల్దార్లు 42 మంది రానున్నారు. 34 మండలాల నుంచి 34 మంది, కలెక్టరేట్ నుంచి 8 మంది తహసీల్దార్లు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా నుంచి మొత్తంగా 42 మంది తహసీల్దార్లు రాయలసీమ జిల్లాలతోపాటు నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. అయితే ఎన్నికల వ్యవహారం ముగియడంతో తిరిగి యథాస్థానానికి తహసీల్దార్లు రానున్నారు. ఈ క్రమంలో ఎన్నికల ముందు తిరుపతి జిల్లాకు వివిధ జిల్లాల నుంచి వచ్చిన 34 మంది తహసీల్దార్లు రెండు రోజుల క్రితం రిలీవ్ అయ్యి జిల్లా నుంచి వెళ్లిపోయారు. దీంతో డెప్యూటీ తహసీల్దార్లు 34 మండలాల్లో ఇన్‌చార్జి తహసీల్దార్లుగా వ్యవహరిస్తున్నారు. అయితే తాజాగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెవెన్యూ డివిజన్ పరిధిలో స్థానిక తహసీల్దార్లు పనిచేయడానికి వీలులేదని స్పష్టం చేశారు. దీంతో పక్క రెవెన్యూ డివిజన్‌లో పనిచేయడానికి తహసీల్దార్లు పెద్ద ఎత్తున లాబీయింగ్ చేస్తున్నారు. తమకు నచ్చిన మండలంలో పోస్టింగ్ సంపాదించుకోవడానికి పలువురు ఇప్పటికే ఆయా స్థానిక ఎమ్మెల్యేలతో టచ్‌లో ఉన్నట్లు చర్చ సాగుతుంది. మొత్తంగా రెండు రోజుల్లో అన్ని మండలాలకు కొత్త తహసీల్దార్లు బాధ్యతలు చేపట్టనున్నారు.





వేదమంత్రాలు.. ఆట పాటలు



నిత్యం వేదమంత్రాలు , పూజా కైంకర్యాలు అభ్యసిస్తూ ఉంటారు... అయితే అలసిన మనసుకు కాస్త ఉత్సాహాన్ని ఇచ్చేలా మేము సైతం ఆడుతాం అంటున్నారు వేద విద్యార్థులు. తిరునామాలు ధరించి పంచెకట్టులో ఆకాశంలోకి ఎగురుతూ బాల్‌ని కొడుతూ, బ్యాటింగ్ ఆడుతూ, బౌలింగ్ వేస్తూ ఇలా వేద విద్యార్థులు ఆదివారం తుమ్మలగుంట మైదానంలో సందడి చేశారు. క్రికెట్, వాలీబాల్, త్రోబాల్ మరెన్నో ఆటల్లో మునిగి తేలారు.

సాక్షి ఫొటోగ్రాఫర్ తిరుపతి



ఆగస్టులో విశేష ఉత్సవాలు

తిరుమల: ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన తిరుమలలో ఆగస్టులో నిర్వహించే విశేష ఉత్సవాలను టీటీడీ పీఆర్‌ఓ విభాగం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆగస్టు 4న శ్రీ చక్రత్తాళ్వార్ వర్షతిరునక్షత్రం, శ్రీ ప్రతివాది భయంకర అణ్ణంగరాచార్య వర్ష తిరునక్షత్రం, 7న ఆండాళ్ తిరువాడిపురం శాత్తుమొర. శ్రీవారు పురిశైవారి తోటకు వేంచేపు, 9న గరుడ పంచమి, తిరుమల శ్రీవారి గరుడ సేవ, 10న కల్కి జయంతి, 13న తరి గొండ వెంగమాంబ వర్ధంతి, 14న తిరుమల శ్రీవారి పవిత్రోత్సవాలకు అంకురార్పణ, 15 నుంచి 17వ తేదీ వరకు శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు, 16న వరలక్ష్మీ వ్రతం, నారాయణగిరిలో ఛత్రస్థాపనోత్సవం, 19న శ్రావణ పౌర్ణమి, పౌర్ణమి గరుడ సేవ, రాఖీ పండుగ, హయగ్రీవ జయంతి, విఖానస మహాముని జయంతి, 20న తిరుమల శ్రీవారు శ్రీ విఖానసాచార్య స్వామి సన్నిధికి వేంచేపు, గాయత్రీ జపం, 27న శ్రీకృష్ణాష్టమి, తిరుమల శ్రీవారి ఆస్థానం, 28న శ్రీవారి శిక్యోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించింది.

శ్రీకోదండరామస్వామి ఆలయంలో విశేష ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో ఆగస్టులో పలు విశేష ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆగస్టు 1న పవిత్ర సమర్పణ, 2వ తేదీ పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. 3, 10, 17, 24, 31వ తేదీల్లో ఉదయం 6 గంటలకు శ్రీసీతారామ లక్ష్మణుల మూలవర్లకు అభిషేకం నిర్వహిస్తారు. 3న పునర్వసు నక్షత్రం సందర్భంగా ఉదయం 11 గంటలకు శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. సాయంత్రం 5.30 గంటలకు స్వామి, అమ్మవారిని తిరుచ్చిపై శ్రీరామచంద్ర పుష్కరిణి వద్దకు ఊరేగింపుగా తీసుకెళతారు. సాయంత్రం 6.30 గంటలకు అక్కడ స్వామివారి ఊంజల్ సేవ నిర్వహిస్తారు. 4వ తేదీ అమావాస్య సందర్భంగా ఉదయం 8 గంటలకు సహస్ర కలశాభిషేకం ఉంటుంది. రాత్రి 7 గంటలకు హనుమంత వాహనసేవ జరుగనుంది. 19న పౌర్ణమి సందర్భంగా ఉదయం 8.30 గంటలకు అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీరామచంద్ర పుష్కరిణి వరకు తిరుచ్చి ఉత్సవం, అక్కడ 6.30 గంటలకు ఆస్థానం నిర్వహిస్తారు. 27న శ్రీకృష్ణాష్టమి, 28న ఉట్లోత్సవం నిర్వహిస్తారు.

స్టార్టర్ల చోరీ

ఏర్పేడు: మండలంలోని మన్నసముద్రం పొలాల్లో శనివారం రాత్రి రైతుల స్టార్టర్లు చోరీకి గురయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు పొలాల వద్దనున్న 9 మంది రైతుల స్టార్టర్లను పగులగొట్టి అందులోని విలువైన రాగివైరును అపహరించారు. ఆదివారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు స్టార్టర్లు లేకపోవడంతో లబోదిబోమంటున్నారు. చోరీపై ఎస్పీడీసీఎల్ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు.



దుండగులు అపహరించిన స్టార్టర్లు

మహతిలో ముగిసిన నృత్య పోటీలు



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

తిరుపతి కల్చరల్: మహతి కళాక్షేత్రంలో ఈ నెల 20వ తేదీ నుంచి ఆరంభమైన అభినయ ఆర్ట్స్ 24వ వార్షిక జాతీయ స్థాయి నృత్య, నాటక పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ఓ కళా పండుగలా సాగిన పౌరాణిక పద్యనాటకాలు, సాంఘిక నాటికలు, శాస్త్రీయ, జానపద బృంద నృత్యాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. 9 పౌరాణిక పద్యనాటకాలు, 12 సాంఘిక నాటికల ప్రదర్శనలో కళాకారులు అద్వితీయ అభినయం, హావభావాలతో అద్భుత సెట్టింగ్‌ల మధ్య నాటక ప్రదర్శనలు చేసి పౌరాణిక విశిష్టతను, నృత్య కళా వైభవాన్ని చాటి ప్రేక్షకులను మైమరిపించారు. నాటక పోటీలలో భాగంగా చివరి రోజు ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. సాయంత్రం అభినయ ఆర్ట్స్ వారు ప్రదర్శించిన శ్రీపద్మావతి శ్రీనివాస కల్యాణం భక్తి పరవశంతో సాగింది. కళాకారులను అభినయ ఆర్ట్స్ కార్యదర్శి బీఎస్.రెడ్డి జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి అభినందించారు.



శ్రీపద్మావతి శ్రీనివాస కల్యాణం పద్యనాటకంలోని సన్నివేశం

కిక్కిరిసిన బోయకొండ క్షేత్రం

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండకు ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆషాఢమాసంలో రికార్డు స్థాయిలో 35 వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి ఏకాంబరం తెలిపారు. మన రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు నగలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కోరిన కోర్కెలు ఫలించిన భక్తులు పిండి, నూనెదీపాలు, దీవెలతో మేళతాళాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ అధికారుల ఆధ్వర్యంలో అమ్మవారి తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

ఒక్కరోజే రూ.19.91లక్షలు ఆదాయం!

అమ్మవారి ఆలయంలో ఒక్క ఆదివారం రోజే వివిధ సేవా టికెట్ల విక్రయాల పరంగా ఆలయానికి 19,91,510 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ తెలిపారు. గతంలో ఎప్పుడు ఇంత మొత్తంలో సేవా టికెట్ల రూపేణా ఆదాయం రాలేదని, అందరి సమష్టి కృషితో ఇది సాధ్యమైందని సిబ్బందిని ఈఓ అభినందించారు.




ప్రత్యేక అలంకారంలో గంగమ్మ

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నేతల దాడి

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలోని కొత్తకండ్రిగ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆదివారం పూటుగా మద్యం తాగి వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లపైకి దూసుకెళ్లారు. దొరికిన వారిని దొరికినట్టుగా చితగ్గొట్టారు. పది రోజుల క్రితం ఆటోడ్రైవర్ ఎర్రయ్యపై సురేష్, రాజయ్య బృందం కలిసి దాడి చేసింది. వారిపై బాధితులు ఫిర్యాదు చేయడంతో తొట్టంబేడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. బెయిల్ తీసుకున్న సురేష్ తన స్నేహితులతో కలిసి మద్యం తాగి «మాపైనే కేసు పెడతావా?» అంటూ ఎర్రయ్య కుటుంబంపై దాడికి దిగారు. ఈ క్రమంలో వారి మధ్య తోపులాట జరిగింది. ఒకరిపై ఒకరు కర్రలతో దాడి చేసుకున్నారు. ఈ సంఘటనలో ఇరువర్గాలు పరస్పరం పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెట్టుకున్నాయి. కొత్తకండ్రిగ గున్నయ్య ఆధ్వర్యంలో తమపై దాడి చేశారని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు చెబుతున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

శ్రీకాళహస్తి: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలోని స్కిట్ కళాశాల వెనుక వైపు ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొంది. ఈ ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని మృతుని వివరాల కోసం ఆరా తీశారు. వివరాలు తెలియక పోవడంతో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ కాంతుల్లో విజ్ఞానగిరి



పట్టణంలో విజ్ఞానగిరి క్షేత్రం విద్యుత్ కాంతులతో వెలిగిపోతోంది. శ్రీవళ్లీ, దేవసేన సమేత కుమారస్వామి ఆలయంలో సోమవారం ఆడికృత్తిక మహోత్సవం జరగనుంది. ఈ నేపథ్యంలో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. కుమారస్వామి దర్శనానికి తరలివచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. -శ్రీకాళహస్తి

